ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

బుధవారం | మే 13, 2026 | సంపుటి : 6 | సంచిక : 343 | పేజీలు : 2

## వైభవోపేతంగా శ్రీ హనుమాన్ జయంతి



- శ్రీ అభయాంజనేయ స్వామి వారికి విశేష అభిషేకాలు, పత్రపుష్పార్చనలు, ఆరాధనలు

2 లో

నీట్ ప్రశ్నాపత్రం లీక్, పరీక్ష నిర్వహణలో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్ష మళ్లీ నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించింది. త్వరలోనే నీట్ యూజీ పరీక్ష తేదీలు ప్రకటిస్తామని తెలిపింది. ప్రశ్నపత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం, సీబీఐ విచారణకు ఆదేశించింది




- మే 3న జరిగిన నీట్ పరీక్ష రద్దు చేస్తూ ఎన్‌టీఏ నిర్ణయం
- చెల్లించిన ఫీజు రీఫండ్
- సీబీఐ దర్యాప్తునకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడి

# నీట్ యూజీ పరీక్ష రద్దు

## ప్రశ్నాపత్రం లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశం

**జాతీయం, ఆయుధం:** పరీక్ష నిర్వహణలో పారదర్శకతను కాపాడటానికి, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఎన్ టీఏ వెల్లడించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు విభాగాల నుంచి అందిన నివేదికల ఆధారంగా పరీక్షా ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించినట్లు తెలిపింది. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడం వల్ల పాత పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### ఫీజు రీఫండ్.. త్వరలోనే కొత్త తేదీలు

విద్యార్థులకు ఊరటనిచ్చేలా ఇప్పటికే చెల్లించిన పరీక్ష ఫీజును తిరిగి రీఫండ్ చేయనున్నారు. మళ్లీ నిర్వహించే పరీక్ష కోసం విద్యార్థులు ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎన్‌టీఏ తన సొంత వనరులతోనే ఈ పరీక్షను నిర్వహించనుంది. రీఎగ్జామ్ తేదీలు, కొత్త అడ్మిట్ కార్డుల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తారు. పరీక్ష రద్దు వల్ల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు కలిగే ఇబ్బందిని గుర్తించామన్న ఎన్‌టీఏ, వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టేందుకు ఈ నిర్ణయం తప్పలేదని పేర్కొంది. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించింది.

### సీబీఐ దర్యాప్తు

మరోవైపు నీట్ పరీక్షలో తలెత్తిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. సీబీఐ దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. అందుకు అవసరమైన అన్ని రికార్డులు, పత్రాలు, సమాచారాన్ని అందిస్తామని పేర్కొంది.

### రాజస్థాన్‌లో ప్రశ్నాపత్రం లీక్

రాజస్థాన్‌లోని కోటాలో నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకైనట్లు గుర్తించారు. కోటాలో కోచింగ్ సెంటర్లు ఇచ్చిన మెటీరియల్‌తో పోలి ఉన్నట్లు తేల్చారు. ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలు పరీక్షకు ముందు రాజస్థాన్‌తో కోచింగ్ సంస్థలు పంపిణీ చేసిన మెటీరియల్‌తో పోలి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈనెల 3న జరిగిన పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పరీక్షకు 42 గంటల ముందు వాట్సప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు నిర్ధారించారు. దీనిని విద్యార్థులకు రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారన్న ఆయన కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలు చేశారని గుర్తించామన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఎన్‌టీఏ, నీట్ యూజీ2026కి సంబంధించి అవకతవకలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. తర్వాత కేంద్ర విద్యాశాఖను సంప్రదించి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

### 22.79 లక్షల మంది హాజరు

దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ సహా వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ యూజీ పరీక్ష మే 3న పెన్‌అండ్‌పేపర్ విధానంలో జరిగింది. భారత్‌లోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో కలిపి 5,400కు పైగా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

## 'అమృత్ కాలం'.. దేశానికి విషయుగంలా మారింది:



"నీట్ పరీక్ష రద్దయింది. దేశ వ్యాప్తంగా 22లక్షల మందికి పైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు ఛిన్నాభిన్నమయ్యాయి. కొందరు తండ్రులు రుణాలు తీసుకున్నారు. ఇంకొందరు తల్లులు తమ నగలు అమ్ముకున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం ఎన్నో రాత్రులు మేల్కొని ఉండి చదివారు. ఇందుకు వారికి దక్కిన ప్రతిఫలం ఏంటంటే.. పేపర్ లీకేజీలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో వ్యవస్థీకృతమైన అవినీతి. ఇది కేవలం ఒక వైఫల్యం కాదు.. దేశ యువత భవిష్యత్తుపై జరిగిన నేరం. ప్రతిసారి పేపర్ మాఫియా ఎలాంటి శిక్షల్లేకుండా తప్పించుకు తిరుగుతుండగా.. నిజాయతీపరులైన విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తున్నారు.
ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన భారం, అస్థిరతను భరించాల్సి వస్తోంది. ఒకరి తలరాతను వారి శ్రమతో కాకుండా.. డబ్బు, పలుకుబడితో నిర్ణయిస్తుంటే ఇక విద్యకు నిజమైన అర్థం ఏముంటుంది? ప్రధాని మోదీ చెబుతోన్న 'అమృత్ కాలం'.. దేశానికి విషయుగంగా మారింది" అని రాహుల్ గాంధీ ఆక్షేపించారు.

## విద్యార్థులకు శాపంగా ఎన్టీఏ వైఫల్యం: కేటీఆర్



ప్రశ్నాపత్రం లీక్‌తో నీట్ పరీక్ష రద్దు కావడం కేంద్రానికి సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్టీఏ వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందురోజే లీక్ అయ్యాయని.. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆక్షేపించారు. 2024లోనూ ప్రశ్నాపత్రం లీకైందన్నారు. ఎన్డీయే ప్రభుత్వ వైఫల్యం వల్లే మరోసారి అలాంటి పరిస్థితి వచ్చిందన్నారు.



# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యాన్ని సహించబోం

- కలెక్టర్లపైనా చర్యలు తప్పవు
- రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి
- కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలి
- వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలన్నారు.

**ధాన్యం సేకరణలో జాప్యం :**

రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ధాన్యం సేకరణలోని సమస్యలపై వివరాలను తెలుసుకున్నారు. గత కొద్ది రోజులుగా ధాన్యం సేకరణలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతన్నలు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం పూర్తి వివరాలను ఆయా జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

**లారీలు అందుబాటులో ఉండాలి :**

సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులోకి తీసుకురాని కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు బుక్ చేయాలని ఆదేశించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం, మొక్కజోన్న కొనుగోలు మిగతా2లో..



2 లో

## ఐదు రోజులు భగభగ

- రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- ఈ నెల చివరి వరకు ఎండలు తీవ్రత ఉంటోందని వ్యాఖ్య

# విద్యుత్ పనులను వేగవంతం చేయాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి. ఐ.ఏ.ఎస్

**ములుగు, ఆయుధం:** ములుగులో కొత్తగా నిర్మిస్తున్న డిపార్ట్‌మెంటల్ ఎస్పీఎం షెడ్ పనులను జూన్ నెలాఖరు నాటికి వేగవంతంగా పూర్తి చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఎస్ ములుగు జిల్లాలో పలు విద్యుత్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ప్రైవేట్ ఎస్పీఎం షెడ్‌ను సందర్శించి, ఫెయిల్యూర్ ట్రాన్స్‌ఫార్మర్ల రికార్డులు, నిర్వహణ విధానం, పనితీరును పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల ప్రక్రియను మరింత వేగవంతం చేసి రోలింగ్ స్టాక్ పెంచుకోవాలని సూచించారు. ట్రాన్స్ఫార్మర్ల ను రిపేర్లు చేసి త్వరితగతిన అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 33



కెవి కొత్త లైన్ పనులను సీఎండీ పరిశీలించారు. ఈ లైన్ సుమారు 27 కిలోమీటర్ల అటవీ ప్రాంతం గుండా కర్లపల్లి సబ్ స్టేషన్ నుండి వస్తూ లింగాల కొత్త సబ్ స్టేషన్ కు కలుస్తుందని అధికారులు వివరించారు. అదేవిధంగా పస్రా సెక్షన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సెక్షన్ ఆఫీస్ పనులను పరిశీలించి, ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ... 33/11 కెవి లింగాల నూతన సబ్ స్టేషన్ ఏర్పాటుతో గుండాల, కొడిశెల లింగాల పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగ్గా అందుతుందని సీఎండీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ నాణ్యత మెరుగుపడటంతో పాటు అంతరాయాలు తగ్గుతాయని పేర్కొన్నారు. లో వోల్టేజ్ సమస్య ఉండదని వివరించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎండీ వెంట సి.ఈ రాజు చౌహన్, ఎస్ఈ ములుగు బేతి బిక్షపతి, ములుగు డీఈ ఆపరేషన్ నాగేశ్వర్ రావు, డీఈ ఎటూరునాగారం పురుషోత్తం డీఈ (ఎంఆర్టీ & సి) సదానందం, ఈఈ సివిల్ వెంకట్రాం, ఏ.డి.ఈ సివిల్ ప్రణయ్, సందీప్ పాటిల్, తాడ్వాయి ఏ.డి.ఈ రాజేష్, ములుగు ఏ.డి.ఈ వేణు గోపాల్ పాల్గొన్నారు.



## ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ ప్లీనరీ

- పలు కీలక అంశాలపై చర్చ
- నేతలకు అధినేత కేసీఆర్ దిశా నిర్దేశం

**హైదరాబాద్, ఆయుధం:** ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌చార్జిల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్య విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా, పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉప నాయకులు పాల్గొన్నారు. అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, ఉన్నారు.



## జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత పంపిణీ

2 లో

- హైదరాబాద్‌లో స్థలముంటే.. నెలాఖరులోపు ఇందిరమ్మ ఇల్లు: పొంగులేటి

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అధికారులు ఫోకస్ పెట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- జిల్లా అధికారులు, తహసిల్దార్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం

**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను మరింత వేగవంతం చేయడంపై జిల్లా అధికారులు, తహసిల్దార్లతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వారిగా ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి గురించి అధికారులను కలెక్టర్




అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 146 పోలింగ్ కేంద్రాలలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ తక్కువగా ఉందని, దీంతో 34 పోలింగ్ కేంద్రాలకు మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా పర్యవేక్షించేందుకు 46మంది జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులతో ఇంటింటికి తిరుగుతూ 2002 ఓటర్ల జాబితా వివరాలను సేకరించి 2025 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ 70శాతం వరకు పూర్తి చేయాలన్నారు. అధికారులు తమ కార్యాలయ పరిధిలో ఉన్న ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులతో ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేయించాలన్నారు. బుధవారం నుండి వారం రోజుల్లోగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 70శాతం కంటే పైగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. సోమవారం ఎస్ఐఆర్ పురోగతిపై అధికారులతో తిరిగి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అధికారులు పూర్తిస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డిఆర్డీవో మేన శ్రీను, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, పలు శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు వేసవిలో పిల్లలను జాగ్రత్తగా కనిపెట్టండి

**- డాక్టర్ అనితా రెడ్డి**

హనుమకొండ, ఆయుధం: వేసవి సెలవుల్లో పిల్లలు ఈతల పేరిట జలాశయాల్లోకి వెళ్లి ప్రాణాపాయ స్థితికి రాకుండా జాగ్రత్త వహించాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. మైనర్ పిల్లలు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని అన్నారు. పిల్లల చదువు, అలవాట్ల పట్ల తల్లిదండ్రులు కుటుంబ పెద్దలు జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. తల్లిదండ్రుల ప్రవర్తన, మాట్లాడే తీరు పిల్లలపై ప్రభావం చుతుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సమయంకేటాయించాలని అన్నారు, లేదంటే పిల్లలు సెల్ కి బానిసలుగా మారి, ఒంటరిగా ఉన్నప్పుడు చెడు ఆలోచనలు చుట్టు ముట్టి చెడు సావాసనాల



బారిన పడతారని తల్లిదండ్రులు దృష్టి పెట్టి వేసవి సెలవులు ఆనందంగా, ఆహ్లాదకరమైన వాతావరణం లో సాగేలా పిల్లలను జాగ్రత్త చూసుకోవాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. మహిళలు, పురుషులు పరస్పర అవగాహనతో మెలగుతూ, కుటుంబంలో సమస్యలు రాకుండా బాధ్యతతో మెలగాలని, కుటుంబంలో వృద్ధుల పట్ల గౌరవభావంతో మెలిగేలా పిల్లలకి మంచి అలవాట్లు, మంచి నడవడిక నేర్పాలని అన్నారు.



## జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత పంపిణీ

- **హైదరాబాద్‌లో స్థలముంటే.. ఈనెలాఖరులోపు ఇందిరమ్మ ఇల్లు: పొంగులేటి**

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

## ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- **మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ.**
- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**ములుగు, ఆయుధం:** ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, మూడు రోజుల పాటు ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ఉత్సవాల షెడ్యూల్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలను, ప్రతిబింబించేలా ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో, జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల, జడ్.పి.హెచ్.ఎస్. బాలికల పాఠశాలలో మే 20, 21, 22వ తేదీలలో మూడు రోజులపాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్, గిరిజన నృత్యాలు, కవి సమ్మేళనం పలు అంశాలలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే వేదికలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వంటి అంశాలలో ఎలాంటి లోటుపాట్లు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## కోతి విగ్రహానికి అభిషేకం..




**వరంగల్, ఆయుధం:** కాశీబుగ్గ 19వ డివిజన్లో వివేకానంద కాలనీ రోడ్ నెంబర్ 2 లో హనుమాన్ జయంతి సందర్భంగా కోతి విగ్రహం వద్ద అభిషేకము, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్, మాజీ కౌన్సిలర్ ధూపం సంపత్, కాశిబుగ్గ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు గుళ్ళపెల్లి రాజకుమార్, గోరంట్ల మనోహర్, బిజెపి నాయకులు సముద్రాల పరమేశ్వర్, మార్త ఆంజనేయులు, వేముల నాగరాజు, క్యాతం రంజిత్, బాల మోహన్, కంచ సంపత్, రంగు శ్రీధర్, వెల్దండి లక్ష్మణ్, గణిపాక సుధాకర్, బొప్పరాతి నగేష్, పోతన లక్ష్మీనరసయ్య, క్యాతం రవీందర్, క్యాతం రాజు, రమేష్, పవన్, లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం అధ్యక్షులు వంగరి రాంప్రసాద్, పసునూటి శ్రీకాంత్, గాజుల రాజేష్, ఆడెపు సదానందం, కలివేలు శేషు, రామ యాదగిరి, గుండా రవి, పల్లకొండ హరి, పెండ్యాల సోను, కుసుమ సారంగపాణి, చిలగాని రాజు, కాశిబుగ్గ ప్రజా ప్రతినిధులు తదితరు పాల్గొన్నారు.

## జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- **క్షేత్రస్థాయిలో జనగణన ప్రక్రియ పరిశీలించిన జాయింట్ డైరెక్టర్ సుబ్బారాజు**



**వరంగల్, ఆయుధం:** జనగణన-2027 ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని హైదరాబాద్ జనగణన శాఖ జాయింట్ డైరెక్టర్ డి.సుబ్బారాజు అధికారులకు సూచించారు. మంగళవారం హనుమకొండలోని 28వ డివిజన్ పరిధిలో గోవిందరాజుల గుట్ట, సత్యం లేన్, స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో జరుగుతున్న జనగణన ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు విధానం, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జనగణన దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జనగణన శాఖ సెక్షన్ ఆఫీసర్ సతీష్, రెవెన్యూ అధికారి బి.శ్రీనివాస్, ఆర్ఐ అశోక్ కుమార్, వార్డ్ ఆఫీసర్, బిల్ కలెక్టర్ కుమారస్వామి, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు హాజరయ్యారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన




**వేలేరు, ఆయుధం:** వేలేరు మండల కేంద్రంలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా 6514 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి జిల్లా స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వారం రోజులలో రైతులకు సంబంధించిన మొత్తం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కమిటీ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా శ్రీ హనుమాన్ జన్మోత్సవ వేడుకలు

- **శ్రీ అభయాంజనేయ స్వామి వారికి విశేష అభికాలు, పత్రపుష్పార్చనలు, ఆరాధనలు**



**జనగామ, ఆయుధం:** హనుమాన్ జయంతి పురస్కరించుకొని శ్రీరాంనగర్ కాలనీ, మూలబావి శ్రీ హనుమత్ రామనాథ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. దేవాలయ ప్రధానార్చకులు డా.మోహనకృష్ణ భార్గవ వైదిక నేతృత్వంలో ప్రాతఃకాల ఆరాధనలతో మొదలుకొని గణపతిపూజ, పుణ్యాఃవచనం, రక్షాబంధన, నవకలశ స్థాపన, కలశారాధనలు, అనంతరం భక్తులతో సామూహికంగా కలశాలతో దేవాలయ పరిక్రమణ, అనంతరం శ్రీ అభయాంజనేయ స్వామి వారికి పంచామృతాలు, ఫలరసాలు, ఓషదులతో, నవకలశాలతో విశేష అభిషేకాన్ని నిర్వహించారు. అభిషేకానంతరం స్వామి వారికి వస్త్రాలంకరణ, పుష్పమాలాంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారికి చందన పత్రపుష్ప అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణమంతా రామనామం, హనుమాన్ నినాదాలతో మార్మోగింది. మహానీరాజనం, మహామంత్రపుష్పం, మహాభోగము అనంతరం భక్తులకు వేద మహాదాశీర్వచనం, తీర్థప్రసాదాలు వితరణ అందించారు. భక్తులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పండితులు మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ హనుమాన్ ధైర్యానికి, శక్తికి, పరాక్రమానికి, భక్తికి, సహనానికి, జ్ఞానానికి, చైతన్యానికి ప్రతీక అన్నారు. హనుమాన్ ఆరాధన బుద్ధి, బలం, యశస్సు, కీర్తి పెంపొందుతాయన్నారు. హనుమాన్ జన్మోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందాడి యాదగిరి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, తూముకుంట్ల ఉమాకర్, సత్యనారాయణ, రమేష్, తదితరులు, మహిళా భృందం, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో నిర్లక్ష్యాన్ని సహించబోం : సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి..)



సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గిడ్డంగుల సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

**ధాన్యం సేకరణ సాఫీగా జరగాలి :**

సేకరించిన ధాన్యాన్ని తాత్కాలికంగా రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్‌కు తరలించాలని సీఎం సూచించారు. వెసులుబాటు ఆధారంగా అక్కడి నుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దని చెప్పారు. అవసరమైన చోట పోలీసుల సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు నివేదికలు పంపాలని తెలిపారు.

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని సీఎం తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు.

**బాధ్యతాయుతంగా వ్యవహరించండి**

కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు.

## శ్రీ వరద దత్త క్షేత్రంలో వైభవంగా హనుమాన్ జయంతి

**వరంగల్, ఆయుధం:** నగరంలోని ములుగు రోడ్డు ప్రాంతంలో గల శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆశ్రమంలోని కార్యసిద్ధి ఆంజనేయ స్వామి కి భక్తులు ఉత్సవ మూర్తికి సామూహికంగా చందనం అభిషేకం నిర్వహించుకున్నారు. అనంతరం మూల మూర్తి శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారికీ అర్చకులు రాపాక గోపికృష్ణ శర్మ చందనం, తేనే, పాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యం తో అభిషేకం చేశారు అనంతరం స్వామికి అలంకరణ, తర్వాత 1008 వడ లతో వడమాల సేవ, ఆకు పూజలు చేశారు. నైవేద్యం నివేదన, మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు మహా అన్న ప్రసాదం వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు కృష్ణ ప్రసాద్, చెకిలం ఏకంబరం, జూలూరి శ్రీనివాస్ రావు, విజేందర్ రెడ్డి, డాక్టర్ కంటెమ్ లక్ష్మి నారాయణ, వద్దే రవీందర్, వడిచర్ల శ్రీనివాస్, కర్రు ఓంప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.





## శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి



**వరంగల్, ఆయుధం:** మట్టెవాడలోని అతిపురాతన ప్రాచుర్యమైనటు వంటి శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం లో మంగళవారం హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి అభిషేకము, వడమాల, ఆకు పూజ చేశారు. సాయంత్రం పడవేల తమలపాకులతో స్వామివారికి అర్చన, ఆకు పూజలో భక్తులు సామూహికంగా పాల్గొని 21సార్లు హనుమాన్ చాలీసా పారాయణం హారతి నైవేద్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఇరుకుల్ల రమేష్ బెజుగం రజినీకాంత్, కొత్త వెంకటకృష్ణ, ఫణీష్, దీవ్వెల నాగరాజు, శ్రీనివాస్, ఇరుకుల్ల రాజమణి, కొత్త మాధవి, జులకంటి లక్ష్మీకాంత, బెజుగం వనిత, పాలరాపు వనజ తదితరులు పాల్గొన్నారు. దేవాలయ అర్చకులు ఆరుట్ల రామాచారి, కృష్ణమాచారీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాల నఅంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అన్నాడీఎంకే రెబల్స్‌తో సీఎం విజయ్ భేటీ



**జాతీయం, ఆయుధం:** తమిళనాడు శాసనసభలో సీఎం విజయ్ బలపరీక్షకు సిద్ధమవుతోన్న వేళ.. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు ఉత్కంఠను కలిగిస్తున్నాయి. ఇప్పటికే అన్నాడీఎంకే పార్టీలో చీలిక ఏర్పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి విజయ్ భేటీ కావడం చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్..తదితర మిత్రపక్షాల నేతలతో సమావేశమైన విజయ్.. అన్నాడీఎంకే సీనియర్ నేత సీవీ షణ్ముగం నివాసానికి వెళ్లారు. అక్కడ అన్నాడీఎంకే రెబల్స్ ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమయ్యారు. అసెంబ్లీలో బుధవారం బలపరీక్ష జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే పార్టీ 47 స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఫలితాలు వెలువడిన తర్వాత ఈ పార్టీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తీరును సీనియర్ నేతలు సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి, సి.విజయ భాస్కర్ తదితరులు బహిరంగంగానే విమర్శించారు. ఈ క్రమంలోనే గత శనివారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతు తెలపటం, శాసనసభా కమిటీ నాయకత్వ బాధ్యతలపై వాడివేడి చర్చ జరిగింది. ఇందులో ఈపీఎస్ నిర్ణయాలతో విభేదించిన సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి సమావేశాన్ని బహిష్కరించారు. ఈ నేపథ్యంలోనే పార్టీలో చీలిక ఏర్పడింది. తాము అన్నాడీఎంకే నుంచి బయటకు వచ్చి విజయ్‌కు మద్దతిస్తామని షణ్ముగం నేతృత్వంలోని రెబల్ ఎమ్మెల్యేలు ఈ ఉదయం ప్రకటించారు. దీంతో షణ్ముగం వర్గం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను విజయ్ కలిశారు.

## ఐదు రోజులు భగభగ

- **రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**
- **హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**
- **ఈ నెల చివరి వరకు ఎండలు తీవ్రత ఉంటోందని వ్యాఖ్య**

హైదరాబాద్, ఆయుధం: తెలంగాణలో గత నెల రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండలు ఎప్పుడు తగ్గుతాయా, కాస్తా ఉపశమనం దొరుకుతుందా? అని ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతవరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారని తెలిపింది. ఈ నెల చివరి వరకు ఎండలు తీవ్రత ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు. మరోవైపు జిల్లాల్లో వరి, మొక్క జొన్న పంటలు కల్లాల్లోనే ఆరబెడుతున్నారు. అకాల వర్షాలు కూడా అక్కడక్కడ రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**40 డిగ్రీలు దాటితే ఆరెంజ్ అలర్ట్ జారీ**

నాలుగైదు రోజుల నుంచి ద్రోణి దగ్గరగా ఉండటం, సముద్రం నుంచి తేమ గాలులు రావడం, ఉరుములు మెరుపులు రావడం వల్ల చిన్న చిన్న జల్లులు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని వల్ల ఈ విండ్ డైరెక్షన్‌లో తేడా ఉండటంతో గత 5 నుంచి 6 రోజులు మూడు నుంచి ఐదు డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తగ్గిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పరిస్థితి బలహీనపడిందని తెలిపారు. సోమవారం నుంచి యధావిధిగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని స్పష్టం చేశారు. సోమవారం ఉష్ణోగ్రత రెండు ప్రాంతాల్లో పెరిగిందన్నారు. టెంపరేచర్ 40 డిగ్రీలు దాటితే ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తామన్నారు.

## నీట్ పరీక్ష రద్దు కేంద్ర ప్రభుత్వ వైఫల్యం

- **సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**హనుమకొండ, ఆయుధం:** నీట్ పరీక్షా పత్రాల లీకేజీ, దేశ వ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యమేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్ (ఎన్ఈఈటి) పరీక్షకు హాజరయ్యారని, పరీక్ష నిర్వహణలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీ అత్యంత ఆందోళనకరమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని నీట్ పరీక్ష రాశారని, అలాంటి కీలక పరీక్షలో అవకతవకలు చోటుచేసుకోవడం విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందని తెలిపారు. కేంద్రంలో, రాజస్థాన్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని దద్దమ్మ ప్రభుత్వం కేంద్రంలో ఉండటం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని తక్కలపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు దేశ విద్యా వ్యవస్థ పరువును దిగజార్చాయని, ఈ పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. ఈ సంక్షోభానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు.నీట్ ప్రశ్నాపత్రాల నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలం

**వరంగల్, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలను ఈ నెల 15 తారీకు, శుక్రవారం వేలం వేయనున్నట్లు సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రభుత్వ పోలీస్ వాహనాలకు సంబంధించి రిపేర్ చేయబడిన బ్యాటరీలు, టైర్లు, విడిభాగాలను వేలంలో అందుబాటులో ఉంచుతామని, ఆసక్తి గల వ్యక్తులు శుక్రవారం ఉదయం 10 గంటలకు కమిషరేట్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ (యంటీవో)లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8712685158, 9440242895, 9949568320 నంబర్లకు సంప్రదించగలరని సీపీ తెలిపారు.

## జనగణన సర్వేలో వివరాలను నమోదు చేయించుకోండి

**చౌటకుర్, ఆయుధం:** చౌటకూర్ మండల బొమ్మరెడ్డిగూడెంలో మంగళవారం జనగణన సర్వే ప్రారంభమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్యూమరేటర్లు బొమ్మరెడ్డిగూడెం లో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వ హించారు. ప్రతీ ఇంటికి సెన్సస్ గుర్తింపుగా సీఎన్ నంబర్లు నమోదు చేశారు. సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు, నివాస పరిస్థితులు తదితర అంశాలను నమోదు చేస్తున్నారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ మాట్లాడుతూ ప్రజలు సరైన సమాచారం అందించి సర్వేకు సహకరించాలని.. ఏ ఒక్క ఇల్లు మిస్ కాకుండా ప్రతి కుటుంబం తప్పకుండ సరైన వివరాలు అందించి తమ వివరాలను జన గణన కుటుంబ సర్వేలో నమోదు చేసుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. వారి వెంట గ్రామ పంచాయతీ సెక్రెటరీ నరేష్, వార్డు సభ్యులు మూడ్ గోపాల్, ఖోల మేనక గణేష్, నాయకులు బాబులాల్, రాజు, ఆంజనేయులు, మెగావత్ రాజు, అవినాష్, అభిలాష్ లు ఉన్నారు.



Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695